ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 28.06.2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రేపు నిజామాబాద్ లో పసుపు బోర్డును ప్రారంభించనున్నారు.
2. మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావు జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.
3. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని ఆలోచనలను ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ ప్రసంగం రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారం అవుతుంది.
4. రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో బీఈ, బీటెక్ సీట్ల భర్తీ కోసం నిర్వహించే ఎప్‌సెట్ తొలి విడత వెబ్ కౌన్సెలింగ్ ఈరోజు ప్రారంభమైంది.

--------------------------

**హోం మినిస్టర్:**

కేంద్ర హోం మంత్రి అమిత్ షా రేపు నిజామాబాద్ లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా అమిత్ షా పసుపు బోర్డును లాంఛనంగా ప్రారంభించి, బోర్డు లోగోను విడుదల చేస్తారు. అనంతరం రైతు సభలో అమిత్ షా ప్రసంగిస్తారు. దేశవ్యాప్తంగా పసుపు బోర్డు కార్యకలాపాలకు కేంద్రంగా నిజామాబాద్‌లో బోర్డు జాతీయ కార్యలయం ఏర్పాటు కానుంది. బోర్డు ప్రారంభం తర్వాత కేంద్ర మంత్రులు అమిత్ షా, పీయూష్ గోయల్ ఇతర మంత్రులు, అధికారులు కలిసి తదుపరి కార్యాచరణపై చర్చలు జరుపుతారు.

**MSL**

---------------------

**PV-CM:**

పి.వి.నరసింహారావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ జుబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బహుభాషాకోవిదుడి గా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా ఆయన దేశానికి ఎనలేని సేవలను అందించారని కొనియాడారు.

**ఎంఎస్ఎల్**

-------------------------

**PV**

మాజీ ప్రధానమంత్రి, భారత రత్న పివి నరసింహారావు జయంతి సందర్భంగా ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. హైదరాబాద్ లోని PV జ్ఞానభూమి వద్ద ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో PV కుటుంబ సభ్యులు, పలువురు నాయకులు, మంత్రులు, అధికారులు ఆయనకు ఘన నివాళి అర్పించారు. హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ జ్ఞానభూమి వద్ద మాట్లాడుతూ... పివి దేశంలో అనేక ఆర్థిక, విద్యా రంగ సంస్కరణలు అమలు చ్యారనీ, నవోదయ విద్యా సంస్థలు, గురుకులాల ఏర్పాటుకు నాంది పలికారనీ కొనియాడారు.

శాసనసభ భవనం లాబీ హాల్ లో PV చిత్రపటానికి శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ... బహుముఖ ప్రజ్ఞాశాలి PV ఆశయాలకు అనుగుణంగా నడవాల్సిన అవసరం ఉందన్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... PV ఆర్థికవేత్తగా చేపట్టిన సంస్కరణల వల్లే దేశం ఆర్థిక సమస్యలను తట్టుకుని నిలబడుతోందని అన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు, లెజిస్లేచర్ కార్యదర్శి Dr V నరసింహాచార్యులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశం ఆర్థికంగా, క్లిష్ట పరిస్థితులలో ఉన్న సమయంలో ప్రధానమంత్రిగా పివి నరసింహారావు చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక ప్రగతికి పునాది వేశాయని కేంద్రం హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఒక సందేశంలో పేర్కొన్నారు.

దేశానికి, కాంగ్రెస్ పార్టీకి పివి నరసింహారావు అందించిన సేవలు మరువలేనివని, ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలే ఈరోజు దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా నడిపిస్తున్నాయని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆయన జయంతి సందర్భంగా పివి నరసింహారావుకు ప్రదేశ్ కాంగ్రెసు కార్యాలయంలో నివాళులర్పించారు.

ఇలా ఉండగా, మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహరావు జయంతి సందర్భంగా పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట దళంలో పని చేసిన PV జీవితం రాజకీయ వ్యవస్థకు, నాయకులకు గొప్ప సందేశమని ఈటెల రాజేందర్ పేర్కొన్నారు.

**MSL/PNs**

-----------------------------------

**PV-BRS:**

పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా, ఆర్థిక సంస్కరణలను తెచ్చి దేశాన్ని భారీ సంక్షోభం నుండి గట్టెక్కించిన మహా మేధావని BRS కార్యనిర్వాహక అధ్యక్షులు K తారక రామారావు సామాజిక మాధ్యమ పోస్టులో కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనకు BRS పార్టీ ఘనంగా నివాళి అర్పించింది.

**MSL**

------------------------

**JURALA**

కృష్ణా బేసిన్ తో కురుస్తున్న భారీ వర్షాలతో జూరాల జలాశయానికి వరద పెరిగింది. దీంతో అధికారులు 12 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ నుంచి లక్షా 10 వేల క్యూసెక్కులు నీరు వస్తుండగా, లక్షా 14 వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు.

**DESK**

---------------------

**RATION BIYYAM**

రాష్ట్రంలో మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ ఎల్లుండితో ముగియనుంది. ఇప్పటి వరకు 92 శాతం మంది లబ్దిదారులకు రేషన్ సరఫరా పూర్తయింది. 5 లక్షల 27 వేల టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు జూన్, జులై, ఆగస్ట్ నెల రేషన్

కూడా ఈ నెలలోనే ఇస్తున్నారు. ఇప్పటి వరకు తీసుకోని వారు ఉంటే ఎల్లుండి వరకు రేషన్ షాపులకు వెళ్లి తీసుకోవచ్చు.

**DESK**

---------------------------

**PM - MANN KI BAAT:**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని ఆలోచనలను దేశ, విదేశాల ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ ప్రసంగం రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారం అవుతుంది. ఇది ప్రతినెలా ప్రసారమయ్యే రేడియో కార్యక్రమంలో 123వ సంచిక. కాగా, ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ మొత్తం నెట్‌వర్క్, AIR న్యూస్ వెబ్‌సైట్, కేంద్ర సమాచార, ప్రసార శాఖ YouTube ఛానెల్‌లలో కూడా ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. హిందీ ప్రసంగం ముగిసిన వెంటనే తెలుగు అనువాదం ప్రసారం అవుతుంది.

**NSD**

----------------------

**పిజెఆర్ - ఫ్లై ఓవర్**

ఔటర్ రింగ్ రోడ్డు నుండి కొండాపూర్ వరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పిజెఆర్ - ఫ్లై ఓవర్ ఈ సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. 1.2 కి.మీ పొడవు, 24 మీటర్ల వెడల్పుతో ఆరు లేన్‌లతో నిర్మించిన ఈ ఫ్లైఓవర్ తో హైదరాబాద్ ప్రజలకు, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో ప్రయాణించే వారికి ప్రయోజనం చేకూరుతుంది. గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది. ఈ ఫ్లైఓవర్‌ను వ్యూహాత్మక రహదారి అభివృద్ధి కార్యక్రమం (SRDP) కింద సుమారు 182 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించారు.

**డెస్క్**

-------------------------------

**నల్లగొండ**

బడిబాట కార్యక్రమం ద్వారా ఈ విద్యా సంవత్సరంలో నల్లగొండ జిల్లా వ్యాప్తంగా దాదాపు 9 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా ప్రవేశాలు పొందారని జిల్లా విద్యా శాఖ

అధికారి పి బిక్షపతి తెలిపారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత వసతుల గురించి చేసిన ప్రచారం మంచి ఫలితాలు ఇచ్చిందని చెప్పారు.

**పిటిసి, నల్గొండ**

-----------------------

**ఆపరేషన్ ముస్కాన్**

రాష్ట్ర వ్యాప్తంగా జులై ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు  ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తామని అడిషనల్ DGP చారుసిన్హా తెలిపారు. తప్పిపోయిన, అనాథలైన, అక్రమ రవాణా చేయబడుతున్న పిల్లలను రక్షించి పునరావాసం కల్పిస్తామన్నారు.

**డెస్క్**

----------------------------

**ఎప్‌సెట్ - 2025**

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో బీఈ, బీటెక్ సీట్ల భర్తీ కోసం నిర్వహించే ఎప్‌సెట్ తొలి విడత వెబ్ కౌన్సెలింగ్ ఈరోజు ప్రారంభమైంది. వచ్చే నెల 7వ తేది వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుంది. ఈసారి ఏపి నాన్ లోకల్ తొలగించడంతో ఆ సీట్లు స్థానికులకే కేటాయించనున్నారు. ఎస్సీ వర్గీకరణ, దివ్యాంగులకు 5 శాతం కోటా కూడా అమలు చేయనున్నారు. జులై 18వ తేదిన సీట్ల కేటాయింపు ఉంటుంది.

**డెస్క్**

---------------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే 24 గంటల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే సేఅవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేసింది. నైరుతి రుతు పవనాలు నెమ్మదిగా కదులుతుండడం వల్ల రాష్ట్రంలో చాలా చోట్ల పొడి వాతావరణం

నెలకొందని పేర్కొంది.

**PN**

--------------------

**సౌండ్ బైట్ – మెదక్ కలెక్టర్**

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నర్సాపూర్ మున్సిపాలిటీలలో పరిసరాల పరిశుభ్రత పరిశీలించి, వార్డుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మా ఆకాశవాణి ప్రతినిధితో మాట్లాడుతూ....మున్సిపాలిటీలో పరిశుభ్రత సంతృప్తిగా ఉందని కానీ దీనిని మరింత మెరుగుపరచాలని తెలిపారు.

**బైట్ ... కలెక్టర్**

పిటిసి, మెదక్

-------------------

**INTER BOARD**

ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల గడువును జూలై 31వ తేది వరకు పొడిగిస్తున్నట్లు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఇటీవల పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు విడుదలైన సందర్భంగా ఈ నిర్ణయం సప్లిమెంటరీ ఫలితాలు విడుదలైన సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇకపై గడవు పొడిగింపు ఉండదని, ఇదే చివరి అవకాశం అని స్పష్టం చేసింది.

**PN**

-----------------------

**POST OFFICE**

పోస్టాఫీసుల్లో ఆగస్టు ఒకటో తేది నుంచి డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకు పోస్టాఫీసులు యూపీఐ వ్యవస్థతో అనుసంధానం కాకపోవడంతో డిజిటల్ చెల్లింపులు అంగీకరించలేదు. ఐటీ సిస్టమ్ తో కొత్త అప్లికేషన్ చేర్చడంతో వినియోగదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు.

**DESK**

---------------------

**BJP**

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం రేపు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఎల్లుండి నామినేషన్లు స్వీకరిస్తారు. జులై 1న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఉన్న సంగతి తెలిసిందే.

**డెస్క్**

---------------------

**మహబూబాబాద్ ఎమ్మెల్యే**

కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పాలన కొనసాగిస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ అన్నారు. మహబూబాబాద్ లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో తొలిసారి కేవలం 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులు విడుదల చేసి, రాష్ట్ర రైతులకు పెద్ద ఊరటను అందించామని అన్నారు.

**పిటిసి/మహబూబాబాద్**

------------------

**నోటిఫికేషస్**

రాష్ట్ర ప్రభుత్వం డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఆరు వందల పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికెషన్ విడుదల చేసింది. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు జారీ చేసిన నోటిపికేషన్ ప్రకారం వివిధ స్పెషలైజెషన్ లలో 607 పోస్టులకు గాను 228 పోస్టులను మల్టీ జోన్-11 పోస్టులుగా, మిగిలిన వాటిని మల్టీ జోన్ -1గా ప్రకటించారు. వచ్చే నెల 10వ తేదీ నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. జులై 17 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలి.

**పీఎస్**

--------------------------